క్లుప్తంగా

నర్సరీ రైతు మార్గానికి సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు, **వీర హను**మాన్ నర్సరీ రైతు మార్గాని స**త్యనారాయణను** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇం**డియా అధికా**రులు శుక్రవారం ఘనంగా **సత్కరించారు.** బ్యాంకు 106వ వార్షికోత్సవాన్ని **రాజమహేం**ద్రవరంలోని సూర్య గార్డెన్స్**లో నిర్వహిం**చారు. ఈ కార్యక్రమానికి స**త్యనారాయణను** ముఖ్యఅతిథిగా ఆహ్వానించి **సత్కరించారు.** బ్యాంకు లావాదేవీల్లో నిజాయి**తీ, నిబద్ధత గల** రైతుగా మార్గానిని సత్కరించి**నట్లు బ్యాంకు** రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరా**వు తెలిపారు.** కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రాయుడుపాకలు, కోలమూరు, హౌసింగ్ బోర్డు ఏరియా, స్పిన్నింగ్ మిల్లు 1, 2, ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వృద్ధురాలి మృతి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం గుర్తుతెలియని వృద్ధురాలు (సుమారు 70 ఏళ్లు) మృతి చెందింది. ప్రకాశం నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ఆమె బస్టాండ్‌లో అస్వస్థతకు గురైంది. విషయాన్ని గమనించిన రక్షక్ సిబ్బంది ఆమెకు సపర్యలు చేశారు. కోలుకున్న ఆమె తిరిగి విజయవాడ వెళ్లడానికి సిద్ధం కావడంతో టికెట్ కొని బస్సు ఎక్కించారు. అయితే బస్సు ఎక్కిన కొద్దిసేపటికే ఆమె మృతి చెందింది. ఆమె వివరాలు తెలియాల్సి ఉంది.

18న లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం, సీతారామస్వామి దేవస్థానం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన 12వ కార్తిక లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు కోటిలింగాల ఘాట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు కాంగ్రెస్ కో ఆర్డినేటర్ల సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ల సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రాజా థియేటర్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

కాంగ్రెస్ రూరల్ కో ఆర్డినేటర్‌గా తాడాల

కడియం: నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా బుర్రిలంక గ్రామానికి చెందిన తాడాల కొండ్రాజు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి నుంచి తనకు నియామక ఉత్తర్వులు అందాయన్నారు.

సినిమాలు



శ్యామల	: కంగువా
సూర్యమినీ	: వెనమ్, సింగం ఎగైన్
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: మట్కా
రంభ	: బఘీరా
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి, జాతర
కుమారి	: దేవర
అప్సర	: మట్కా
నామవరం	
వీఎస్ మహల్	: కంగువా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మట్కా
కడియం	
వెంకటసూర్య	: కంగువా



గోదావరిలో దీపం వదులుతున్న మహిళ



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



దీపదానం చేస్తున్న మహిళ

పౌర్ణమి కాంతులు

- కిక్కిరిసిన ఘాట్లు
- గోదావరిలో పుణ్యస్నానాలు
- నదిలో దీపాలు వదిలిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సీటీఆర్‌ఐ: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక కాంతులు విరబూశాయి. సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని గోదావరి ఘాట్లు, కాలువలు వద్ద దీపాలు కనువిందు చేశాయి. తెల్లవారుజామునుంచే భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. నదిలో దీపాలను వదిలి పూజలు నిర్వహించారు. సమీపంలోని శివాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. రేవు మెట్లు, రావి చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. అరటి దొన్నెల్లో దీపాల పెట్టి నదిలో వదిలారు. కాగా.. ఉమా మార్కండేయస్వామి దేవాలయంలో స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, భవనేశ్వరీదేవికి కుంకుమార్చనలు జరిగాయి. శృంగేరీ శారదా శంకర మఠంలో చంద్రమౌళీశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. టి.నగర్‌లోని విశ్వేశ్వరస్వామి, సారంగధరేశ్వర స్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి

కడియం: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయాలకు చేరుకుని, దీపాలను వెలిగించారు. నోముల ఆనవాయితీ ఉన్న కుటుంబాలు ఉపవాస దీక్షలను ప్రారంభించాయి. దుళ్లలోని అగస్త్యేశ్వరాలయం, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, వేమగిరి, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, వీరవరం, పొట్టిలంక గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.



ప్రత్యేక అలంకరణలో కడియంలోని మల్లేశ్వరస్వామి



కార్తిక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న మహిళలు



పుష్కరాల రేవులో రావిచెట్టు వద్ద భక్తుల పూజలు



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం

పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

సీటీఆర్‌ఐ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకునేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పట్టభద్రులందరూ ముందుకు రావాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు కోరారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం సారథ్యంలో శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఓటు నమోదు శిబిరం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో శిబిరం వద్దకు పట్ట భద్రులు తరలివచ్చి ఫారం–18 పూర్తి చేసి అవసరమైన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సానబోయిన రామారావు మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటు నమోదుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జార్జి ఆంటోనీ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల నుంచి సరైన నాయకత్వం రావాలని అందుకే ఈ వర్గాలకు చెందిన పట్టభద్రులంతా నిర్లిప్తత విడిచిపెట్టి ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. సంఘం సభ్యుడు మేడిశెట్టి తాతబ్బాయి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, నక్కా వెంకటరత్నం రాజు, బొక్కా సత్య వెంకట ప్రతాప్, కోన లాజర్, బత్తిన ఏడుకొండలు, గుత్తుల గోపీనాథ్ పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటు నమోదు చేస్తున్న సంఘ సభ్యులు

భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కార్తిక పౌర్ణమి సందర్భంగా టి.నగర్‌లోని బాలాత్రిపుర సుందరి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ఎండుగడ్డితో తయారు చేసిన తోరణాన్ని వెలిగించి, దాని కింద నుంచి మూడుసార్లు స్వామివారి పల్లకీని ఊరేగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శోభారాణి ఏర్పాట్లు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కడియం: దుళ్లలోని అగస్త్యేశ్వరస్వామి, కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయాల్లో జ్వాలాతోరణాలు వెలిగించారు. కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



కడియం మల్లేశ్వరాలయంలో వెలిగించిన జ్వాలాతోరణం

కార్తిక దీపోత్సవం

కడియం: దుళ్లలోని ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తిక దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు, దాతల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అయ్యో పాపం..

- మతిస్థిమితం లేని మహిళకు ఆడశిశువు జననం
- ఆదరించిన స్థానిక మహిళలు
- 108లో ప్రభుత్వాసుపత్రికి తల్లీబిడ్డల తరలింపు



108లో మతిస్థిమితం లేని మహిళ

రాజమహేంద్రవరం రూరల్: ఆమెకు మతిస్థిమితం లేదు. తనకు బిడ్డ పుట్టిందన్న స్పృహ కూడా లేదు. పుట్టిన బిడ్డను నలిపేయడం, కొట్టడం చేస్తోంది. గమనించిన స్థానిక మహిళలు వెంటనే ఆమెను చేరదీసి సపర్యలు చేశారు. ఈ సంఘటన శుక్రవారం శాటిలైట్ సిటీ గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఊరుపేరు తెలియని సుమారు 30 ఏళ్ల మతిస్థిమితం లేని మహిళ నాలుగు రోజుల నుంచి శాటిలైట్ సిటీ బి బ్లాకులోని సాయిబాబా గుడి సమీపంలో తిరుగుతోంది. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో మోడల్ హౌస్ వాజ్‌పాయ్ విగ్రహం వద్ద ఆ మహిళ ఓ ఆడశిశువును కొడుతూ, నలిపేస్తుండటాన్ని స్థానిక మహిళ చూసింది. దీంతో ఆడ శిశువును అక్కున చేర్చుకుని సపర్యలు చేసింది. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్త గంగాభవాని, ఏఎన్‌ఎం శివ పార్వతి అక్కడకు చేరుకున్నారు. శిశువుకు ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం తల్లీబిడ్డలను 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలింపు సమయంలో మతిస్థిమితం లేని మహిళ అందరినీ ముప్పతిప్పలు పెట్టింది. అంగన్‌వాడీ కార్యకర్త గంగాభవాని ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మేరీ, సీడీపీవో నాగమణి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారత అధికారి విజయ కుమారి సంఘటన స్థలానికి చైల్డ్‌లైన్ అధికారులను పంపించారు. మతిస్థిమితం లేని మహిళ వివరాలను తెలుసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆమె ఒడిశాకు చెందిన మహిళగా భావిస్తున్నారు.



శిశువుకు పాలు పట్టిస్తున్న స్థానికులు

దోమల దండయాత్ర

- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం
- నిర్మూలనా చర్యలు శూన్యం

కడియం: ప్రజలపై దోమలు దండెత్తుతున్నాయి. ఆరు బయట నిలబడాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తేనెతుట్ట మాదిరిగా దోమలు పట్టుకుని కుడుతున్నాయని వాపోతున్నారు. వాతావరణ ప్రభావం, వర్షాల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు పెరిగిపోయిన ఈ పరిస్థితుల్లో ఇప్పుడు దోమ కాటు కారణంగా ఏ తెగుళ్లు వ్యాప్తి చెందుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులకు మూలకారణం దోమలేనని వైద్యులు చెబుతున్నారు. వీటి నివారణా చర్యలు చేపట్టాలని వారు హెచ్చరిస్తున్నారు. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఇందు కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. దీంతో ప్రజలు మాత్రం వివిధ రకాల జ్వరాలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

ఫాగింగ్ జాడే లేదు

మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఫాగింగ్ మెషీన్లను గతంలో కొనుగోలు చేశారు. ఒకటి రెండుసార్లు వాటిని వినియోగించి, పలు కారణాలు చూపి వాటిని పక్కన పెట్టేశారు. నిర్వహణలో సాంకేతిక సమస్యలు రావడంతో వీటిని వాడడం లేదని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. మరో వైపు సీజనల్ వ్యాధులు ప్రబలే సమయాల్లో దోమల నివారణా మందులను మురుగు కాల్వల్లో స్ప్రే చేయించాల్సి ఉంది. అయితే గత నాలుగైదు నెలలుగా అటువంటి చర్యలేమి లేవు. దీంతో దోమల సంతతి విచ్చలవిడిగా పెరిగిపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది మాత్రం గంబూషియా చేపలను మురుగు కాలువల్లో విడుదల చేసి చేతులు దులిపేసుకున్నారు. అదికూడా ఒకటి రెండు పంచాయతీలకే పరిమితమయ్యారు. దీంతో కడియం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు దోమల బాధ తప్పడం లేదు.

ప్రజలకు భారం

విపరీతంగా పెరిగిపోయిన దోమల నుంచి కాపాడుకునేందుకు ప్రజలు మస్కిటో రిపెల్లెంట్స్‌పై ఆధారపడుతున్నారు. రాత్రి నిద్రపోవాలంటే ముందుగా దోమల నివారణా పరికరాలు ఉన్నాయో? లేదో? చూసుకుని నిద్రకు ఉపక్రమించాల్సి వస్తోందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దోమల నివారణకు వినియోగించే కాయిల్స్, లిక్విడ్స్, అగర్‌బత్తీలు తదితర వాటికోసం కోసం రోజుకు సుమారు రూ.5 నుంచి రూ.10 వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో ప్రతి కుటుంబంపై నెలకు రూ. 300లకు పైగా భారం పడుతోంది. ప్రభుత్వ యంత్రాంగం దోమల నివారణకు సామూహికంగా నివారణా చర్యలు చేపడితే ప్రజలకు వ్యాధుల భయం తప్పుతుంది. అలాగే అదనంగా అయ్యే ఖర్చు కూడా ఉండదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగజేసుకుని దోమల నివారణా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దోమల నివారణకు గంబూషియా చేపలను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆరు బయట నిలబడలేకపోతున్నాం

చీకటి పడిందంటే ఆరు బయట నిలబడలేకపోతున్నాం. తేనెపట్టు మాదిరిగా దోమలు ముసురుకుంటున్నాయి. ముఖం, చేతులు, కాళ్లపై దద్దుర్లు తేలుతున్నాయి. దోమల కారణంగా వ్యాధుల భారిన పడతామోననే భయం వెంటాడుతోంది.

– ఎల్.శ్రీనివాసమూర్తి, దుళ్ల

ఫాగింగ్ చేయడం లేదు

దోమల నివారణకు ఫాగింగ్ గానీ, దోమల నివారణ మందుగానీ చల్లిన దాఖలాల్లేవు. విపరీతంగా పెరిగిన దోమల నుంచి కాపాడుకోవడానికి మస్కిటో రిపెల్లెంట్స్‌ను వాడాల్సి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా దోమకాటుకు గురవుతున్నాం.

– వీవీఎస్ భాను, వేమగిరి

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

సీటీఆర్‌ఐ: పుస్తక పఠనంలో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని తాళపత్రాలు, తామ్ర శాసనాలు, విలువైన గ్రంథాలు, చేతిరాత ప్రతులు, వివిధ వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలను ప్రదర్శకు ఉంచారు. జిల్లా గ్రంథాలయ అధికారి జి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ ప్రసాదుల హరి బహూకరించిన అట్టలు గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు పంపిణీ రాజమహేంద్రవరం సిటీ: పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచుతాయని ఎల్ఐసీ విశ్రాంత అధికారి చెక్క తాతారావు అన్నారు. సీతంపేట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండన్నారు.



గౌతమీ గ్రంథాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

లైఫ్‌స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుస్తక పఠనం వల్ల మానసిక ఆనందం, ప్రపంచ విషయ పరిజ్ఞానం తెలుసుకునే అవకాశం ఉంటుందని సాధు జనార్దన మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు సాధు వెంకట కోటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఆయన లైఫ్‌స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చలుమూరి సత్యనారాయణ, ఆదిరెడ్డి శ్రీనివాసు, గ్రంథాలయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు. స్థానిక ఆల్కాట్‌తోట శాఖాగ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, పుస్తక పఠనం వలన కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి కొత్తపల్లి రమ్యశ్రీ పాల్గొన్నారు.

కడియం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని యూనియన్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ ముత్యాల సూర్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.